క్లుప్తంగా

ఆలయాలు మూసివేత



ఫిరంగిపురం: మండలంలోని గ్రామాల్లో ఆలయాలను చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేశారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి, పొనుగుపాడు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి, 113తాళ్లూరు గ్రామంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాలను గ్రహణం సందర్భంగా మూసివేసినట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో సురేష్ తెలిపారు. అంతేకాక గ్రామంలోని కోదండరామాలయం, అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి ఆలయాలు మూసివేస్తున్నట్లు ఆలయాల అర్చకులు తెలిపారు. మరలా సోమవారం ఉదయం 9 గంటలకు సంప్రోక్షణ అనంతరం పూజలు నిర్వహిస్తామన్నారు.

278వ రోజుకు చేరిన దీక్షలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారంతో 278వ రోజుకు చేరాయి. సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు, యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్‌లు దీక్షా శిబిరాన్ని ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు తమ పార్టీ అధికారంలోకి వస్తే సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, సుభాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, గురవయ్య, కార్మికులు నవనీతమ్మ, శారద, రమణమ్మ, రమాదేవి, అంకయ్య, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం కాటూరి వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డెర్మటాలజీ, పల్మనాలజీ, ఈసీజీ, సీబీపీ, స్కానింగ్ వంటి పరీక్షలు చేశారు. 300 మందికి సాధారణ వ్యాధులకు సంబంధించి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమాన్ని కాటూరి మెడికల్ కళాశాల చైర్మన్ సుబ్బారావు పర్యవేక్షించారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి



తాడేపల్లి రూరల్: ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో భవన నిర్మాణ కార్మిక ఏరియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ, బాలకృష్ణారెడ్డి, భద్రయ్య, తిరుపాల్, దుర్గారావు, లింగమూర్తి, శేషగిరిరావు, మస్తాన్‌రావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: ఉపాధ్యాయుల సేవలు మరువరానివని పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారి అభినందన సభను తెనాలిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నైపుణ్యంతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారన్నారు. అందరూ మన్ననలు పొందడం వలనే అవార్డులు లభించాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మాచర్ల నాగేశ్వరరావు, ఆకురాతి హరివర ప్రసాద్, దివి ఉమాదేవి, మాచర్ల లీలా శ్రీనివాసమూర్తి, ఆరికాటి బాలసుబ్రమణ్యంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ తెనాలి ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల సుబ్బారావు, కోశాధికారి తిరువీధుల నాగేశ్వరరావు, నాయకులు కటకం వెంకట ప్రసాద్, అందె బాలచంద్రమౌళి, కందుల శ్రీనివాసరావు, కొతవరపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ మోసాలను ప్రతి గడపకు వివరిద్దాం

తాడేపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అమరా నాగయ్య



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: నియోజకవర్గంలోని ప్రతి గడపను తట్టి సూపర్‌సిక్స్ మోసాలను ప్రజలకు తెలియజేయాలని తాడేపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అమరా నాగయ్య అన్నారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరా నాగయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల ప్రకారం ఏడాది కాలంలో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగిందనేది వివరించారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు ఇచ్చిన జగనన్నకు, సూపర్ సిక్స్ మోసాలతో గద్దెనెక్కిన చంద్రబాబుకు తేడాను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ నిలబడుతుందని హామీ ఇచ్చారు. రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. కూటమి నాయకుల హామీలను నమ్మి మోసపోయిన ప్రజలకు అండగా ఉండాలని, పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడేలా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం బాబు మోసాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాతూరు గ్రామ అధ్యక్షుడు చలపతి, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి బాజి గంగాధర్, మండల మహిళా అధ్యక్షురాలు నాగ స్రవంతి, మండల కమిటీ నాయకులు కళ్ళం పిచ్చిరెడ్డి, మేకా దామేశ్వరరెడ్డి, తోకల రాంబాబు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, మరియబాబు, యువజన ఉపాధ్యక్షుడు నల్లపు రాంబాబు, ప్రాతూరు గ్రామ కమిటీ నాయకుడు బత్తుల సత్యనారాయణ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సంకురు ఏసు, గ్రామ ఉపాధ్యక్షుడు ప్రాతూరు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

బాబు పాలన మొత్తం మోసం గ్యారంటీ

దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాలను మారుస్తామంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ సంస్థలకు తప్ప పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, అమలు చేస్తున్నామంటూ మొక్కుబడిగా ప్రజలను ఆదుకుంటూ ప్రచారాన్ని ఊదరగొడుతున్నారని వైఎస్సార్‌సీపీ దుగ్గిరాల మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య అన్నారు. ఆదివారం పేరుకలపూడి, చినపాలెం గ్రామాలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీల క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరించారు. ప్రజల నుంచి పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న శివగోపయ్య మాట్లాడుతూ ప్రజల గురించి ఆలోచించి, పల్లె ప్రజల జీవితాలకు వెలుగునిచ్చింది దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, రైతులకు ఉచిత కరెంటు ఇచ్చింది, గ్రామీణ ప్రాంత ప్రజల కోసం వారి ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ ప్రవేశ పెట్టారని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేస్తే వారి తనయుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మరో రెండు అడుగులు ముందుకు వేసి దేశంలో ఎక్కడా లేని విధంగా నవరత్నాల పేరుతో పథకాలు అమలు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా, అక్రమంగా కేసులు పెడుతూ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లోనూ భారీగా కోతలు విధించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పేరుకలపూడి గ్రామ సర్పంచ్ గంపల గంగాధరరావు, ఉప సర్పంచి తాడిబోయిన గంగాధర్ రావు, గ్రామం అధ్యక్షుడు కాసాని వేంకటేశ్వర రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షురాలు పి.సంసోనమ్మ, బీసీ మండల వైస్ ప్రెసిడెంట్ నల్లగోర్ల నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు ఏమినేని ధనుంజయ్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎస్.రత్నం, నాగళ్ల సుబ్బయ్య, శ్రీను, సుధీర్, వీరయ్య, చినపాలెం పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన సుబ్బారావు, సోషల్ మీడియా సభ్యురాలు కుర్రా జ్యోతి, కోనంకి శ్రీనివాసరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పేరుకలపూడిలో క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చినపాలెంలో క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైతులను ఇబ్బంది పెట్టడమే కూటమి లక్ష్యం



నిరసన తెలియజేస్తున్న ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు

70వ రోజు రిలే నిరసన దీక్షలో ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం

తాడికొండ: రైతులను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని, రెండవ ల్యాండ్ పూలింగ్ పేరుతో ఆడుతున్న ఆటల కారణంగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. రాజధాని భూ సమీకరణకు 2వ దశ ల్యాండ్ పూలింగ్ పేరుతో ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనను నిరసిస్తూ తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో కొనసాగుతున్న రిలే నిరసన దీక్షలు ఆదివారంతో 70వ రోజుకు చేరాయి. బాబు, పవన్ కళ్యాణ్‌లు కూటమి పేరుతో అధికారం అడ్డుపెట్టుకొని రైతులు, ప్రజల మనోభావాలతో ఆటలాడుకుంటున్నారని మండిపడ్డారు. ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసి నమ్మి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయకుండా మరో లక్ష ఎకరాల పూలింగ్ పేరుతో స్వార్థం కోసం ప్రయత్నాలు చేయడం దుర్మార్గం అన్నారు. ఈ ప్రాంతంలో రైతులు భూములు అమ్మకాలు కొనుగోలు చేసుకొని ఎంతో కొంత లాభపడుతుండటంతో మార్కెట్‌ను కుప్ప కూల్చి పూలింగ్ పేరుతో రైతులను బిచ్చగాళ్లను చేసే ఎత్తుగడలు వేస్తున్నారని మండిపడ్డారు. రాజధాని అంటే అందరికీ అందులో ప్రాధాన్యత ఉండాలని, రైతులు, ప్రజలు ఆర్థికంగా లబ్ధి పొంది కాలక్రమంలో అభివృద్ధి చెందితే తప్ప ఏకపక్ష వైఖరితో అభివృద్ధి ఎప్పటికీ ఉండదన్నారు. పూలింగ్ పేరుతో ముందుకొస్తున్న ప్రభుత్వం భూమి తీసుకునే రైతులకు కోటి నష్టపరిహారం వెంటనే అందజేయడంతో పాటు 1250 గజాల పూలింగ్ ప్యాకేజీ, ఏడాదికి రూ.1 లక్ష కౌలు, నెలకు ప్రతి మనిషికి రూ.10 వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్

ఎస్ఐ హరిబాబు

మంగళగిరి టౌన్: ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో రౌడీ షీటర్లు పాల్గొంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి రౌడీషీటర్ కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రతి వారం తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రవర్తన మార్చుకొని సామాన్య జీవితాన్ని గడపాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతిరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ..



1986-87 పదవ తరగతి పూర్వ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి సీతానగరంలోని శ్రీరామకృష్ణ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాతూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 1986–87 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు 2వ ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం అందరం కలుసుకుని ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవాలని తీర్మానం చేసుకున్నారు. 38 సంవత్సరాల క్రితం తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకుని ఉల్లాసంగా ఆటపాటల్లో పాల్గొన్నారు. ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చందు, రామకృష్ణారెడ్డి, సీతారెడ్డి, నాగరాజు, మధు, ఉదయలక్ష్మి, కొండమ్మ, ఉష తదితరులు పాల్గొన్నారు.

తాగలేం.. వాడుకోలేం..!



ఫిరంగిపురంలోని కోనేటి చెరువు

- ఫిరంగిపురంలో తాగునీటి సమస్యతో ప్రజల ఇబ్బందులు
- మురికిగా వస్తున్న నీరు
- చర్మవ్యాధులతో ప్రజల బెంబేలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ప్రజలకు తాగునీరందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సరఫరా చేస్తున్న నీరు మురికిగా ఉండటం, పాచి వస్తుండటంతో తాగేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో ఎస్టీ కాలనీ, క్రీస్తునగర్, శాంతిపేట, తూర్పుబజార్, కార్మెల్‌పేట, రాజాపేట, ఆరోగ్యనగర్, విజ్ఞానపురం, కొత్తపేట, విజయదుర్గాకాలనీ, వసంతనగర్ తదితర ప్రాంతాలకు కోనేటి నుంచి విడుదల అయ్యే నీటినే సుమారు పదహారు వేల మంది ప్రజలు వినియోగిస్తున్నారు.

తాగేందుకు పనికిరాదు

కోనేటి నీరు విడుదల చేస్తున్నా.. అది తాగేందుకు పనికి రావడం లేదని, నీరు శుభ్రంగా ఉండటం లేదని ప్రజలు చెబుతున్నారు. రెండు, మూడు రోజులు నిలువ ఉండగానే వాసన వస్తుందంటున్నారు. నీరు మురికిగా ఉంటుందని వాపోతున్నారు.

చర్మవ్యాధులతో ఇబ్బందులు

ఈ నీటిని స్నానానికి వాడుతుంటే చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దద్దుర్లు, చిన్న బొబ్బలు, దురద వంటివి ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. చెరువు శుభ్రంగా లేకపోవడం, ఫిల్టర్ల నుంచి నీటిని విడుదల చేయకపోవడం వల్లనే ఇటువంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు.



నీరు సరఫరా చేసే పంపు హౌస్

కొనుగోలు చేయాలంటే ఇబ్బంది

నీరు సరిగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా రూ.15 చెల్లించి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో చాలా మంది పేద, సన్నకారు, పొలం పనులకు వెళ్లే వారు కావడంతో నీటిని కొనుగోలు చేయాలంటే ఇబ్బందిగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గ్రామంలోని కొన్ని వార్డుల్లో నీరు విడుదల సమయంలో లీకేజీలు ఉండటంతో నీరు పైకి వస్తుంది. కొన్ని చోట్ల మురుగు నీరు సరఫరా అవుతుండటంతో ఆ నీరు పైపులైను ద్వారా ప్రజలకు సరఫరా అయ్యి అనారోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని అంటున్నారు.
- గ్రామంలో నీటిని విడుదల చేసే సమయాలు సరిగా లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాక ఇస్తే తెల్లవారుజామున లేదా మిట్ట మధ్యాహ్నం వంటి సమయాల్లో సరఫరా చేస్తుండటంతో సరైన సమయం తెలియక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు తాగేందుకు వీలుగా శుభ్రమైన మంచి నీరు అందించాలని, లీకేజీలు ఉన్నచోట వాటిని మరమ్మతులు చేయించాలని, సమయపాలన తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుంచనపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నిర్వాహకులు అమ్మిశెట్టి శివ మాట్లాడుతూ తన తండ్రి కీ.శే.అమ్మిశెట్టి రామారావు జ్ఞాపకార్థం అమరావతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు వేణు నాదెళ్ళ, సౌజన్య కేతినేని ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శిబిరాన్ని ఏర్పాటు చేశామని, సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా అమరావతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కొతవరపు రాజేష్, మంద్రు విజయకుమార్, అమ్మిశెట్టి సురేష్, శ్రీలక్ష్మి, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని శివాలయం రోడ్డులో శ్రీరత్నగర్భ సిద్ధి గణపతి దేవాలయం వద్ద శివభక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్త బృందం ప్రతినిధులు మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా ప్రతి నెలలో ఒకరోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివభక్త బృందం ప్రతినిధులు రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, గురునాథం, అవ్వారు వెంకటేశ్వరరావు, మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో బలవన్మరణం

తెనాలిరూరల్: క్షణికావేశంలో ఆటోడ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కోపల్లె గ్రామానికి చెందిన పి.కోటేశ్వరరావు(40) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ, వ్యవసాయకూలి పనులకు వెళుతుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ మృతి చెందగా వైద్యశాల నుంచి ఆదివారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన కొబ్బరినూనె, చెప్పులను ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణానగర్‌లో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గత 16 నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వడం లేదని, సంబంధిత అధికారులు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని విమర్శించారు. తక్షణమే వాటిని అందజేసి వాటితో పాటు ఇతర రక్షణ పరికరాలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు తదితర నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తాడేపల్లి రూరల్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఆప్‌కాస్ రద్దును విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వై.నేతాజీ కోరారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో తాడేపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేతాజీ మాట్లాడుతూ వెట్టి చాకిరి చేస్తూ,



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పని ఎక్కువ ఉన్న చోట కార్మికుల సంఖ్య పెంచాలని అన్నారు. పండుగ రోజులలో ఆఫ్ డే విధానం అమలు కావాలన్నారు. సమాన పనికి సమాన వేతనం.. కనీస వేతనం రూ.26 వేలు పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన హెల్త్ అలవెన్స్ రూ.6 వేలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇతర కార్మికులకు వలె ఎం బుక్ కార్మికులకు కూడా సమాన జీతభత్యాలు చెల్లించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చౌక్కా మరియదాసు, సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, పారిశుద్ధ్య కార్మికుల తాడేపల్లి మండల సంఘం మండల కార్యదర్శి మేకల డేవిడ్, కృష్ణ తులసి, ప్రసన్నకుమార్, మరియమ్మ, ఉషారాణి, జయంతి, వెంకటేశ్వర్లు, జోజిబాబు, నూతక్కి సుధాకర్, నూతక్కి రాంబాబు, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

నుదురుపాడు పీహెచ్‌సీకి తాళం



తాళంవేసి ఉన్న పీహెచ్‌సీ



వైద్యశాల ఎదుట వేచి ఉన్న క్షతగాత్రుడి బంధువులు

- దాదాపు 45 నిమిషాలు వేచి ఉన్న బాధితుడు
- వైద్యశాలలో లేని సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు ఆదివారం తాళాలు వేసి ఉన్నాయి. 24 గంటలు వైద్య సాయం అందించే వైద్యశాల అయినా అక్కడ సంబంధిత వైద్యులు, సిబ్బంది ఉండటం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఫిరంగిపురం నుంచి కండ్రిక వెళ్తున్న జి.వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో రహదారిపై ఉన్న గుంతల వద్ద కింద పడిపోయి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా వైద్యశాలకు తాళాలు వేసి ఉండటంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 45 నిమిషాల పాటు వేచి ఉన్నా ఎవరూ రాకపోవడంతో 108కు ఫోన్ చేసి దానిలో చికిత్స కోసం తరలించారు. కాగా 24/7 వైద్యశాలలో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ప్రజలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎగుమతి సుంకాల పెంపుపై నిరసన



దుగ్గిరాల: భారతదేశంపై ఎగుమతి సుంకాల పెంపు వల్ల ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని సీపీఎం మండల కార్మిక నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. ఆదివారం చిలువూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ వేలాది మహిళా కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులపై ఆ ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.జోజి, జి.బాల చంద్రుడు, ఎం.అంజయ్య, కె.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కాళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.